సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 23 । జూన్ । 2023



సేవలకు గుర్తింపు

అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



మూగజీవాల మృత్యుఘోష

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మెటిల్లాలో చోటు చేసుకుంది. 8లో▸



క్రీడలకు అధిక ప్రాధాన్యం

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2024 ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తండ్రి వార్షికాదాయం రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపిక విధానంలో రిజర్వేషన్ నియమం అమలవుతుందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ వచ్చేనెల 23న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 040– 23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీజేపీతోనే అభివృద్ధి

పార్టీ రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ



మంఖాల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: దేశంలో, రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో ఆ పార్టీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ యాత్ర ద్వారా గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కాలంలో ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. పార్టీ శ్రేణులు ఇంటింటా తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కౌన్సిలర్ బాకి విలాస్, నాయకులు రాచూరి మదన్మోహన్ గుప్తా, నాయకులు కోటకాడి శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, నర్సింహ, నాగార్జున, బూడిద అన్వేష్, రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలమే తెలంగాణ

అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్



శ్రీకాంతచారి తల్లి శంకరమ్మను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇబ్రహీంపట్నం రూరల్: అమరవీరుల త్యాగఫలమే నేటి తెలంగాణ అని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మను సన్మానించారు. అనంతరం అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 21 రోజుల పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించామన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

తపాలశాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జుబేర్



తపాలశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ సెంటర్

షాద్‌నగర్‌రూరల్: తపాలశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తపాలశాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జుబేర్ అన్నారు. పట్టణంలోని తపాలశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ సేవలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునే వారు తపాలశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలని అన్నారు. ప్రతిరోజు 50 నుంచి 60 మంది ఆధార్ సేవలను వినయోగించుకొని అప్‌డేట్ చేసుకుంటున్నారని అన్నారు. తపాలశాఖ కార్యాలయంలో 1000 మందికి పైగా ఆధార్ సేవలను వినియోగించుకున్నారని వివరించారు.

• అభిమానహేళ



శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో 'మేధా రైల్ కోచ్ ఫ్యాక్టరీ' ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. అడుగడుగునా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సీఎం వెంట ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఉన్నారు.

• ఆగ్రహజ్వాల



'దశాబ్ది దగా' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పార్టీ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

• ఆందోళన ఇలా..



ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని కోరుతూ కళాశాల ఎదుట బైఠాయించారు.

ఆగ్రహం.. ఉద్రిక్తం



గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలీసులతో విద్యార్థులు, పేరెంట్స్ వాగ్వాదం



స్పృహతప్పిన ఆదిబట్ల సీఐ రవి

- గురునానక్ కళాశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- మద్దుతు పలికిన ఎన్‌ఎస్‌యూఐ, సీపీఐ నేతలు
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు
- ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఆందోళనకారులు
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితి
- లాఠీలకు పనికల్పించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీకి అనుమతి లేకున్నా కళాశాల యాజమాన్యం మోసం చేసిందని, తమ పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కళాశాల ఎదుట బైఠాయించారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యూనివర్సిటీ పేరుతో యాజమాన్యం ప్రకటనలు ఇచ్చి ప్రచారం చేయడంతో తమ పిల్లలను గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఫీజుల రూపంలో రూ.లక్షల్లో వసూలు చేశారని ఆరోపించారు. యూనివర్సిటీ అనుమతులు రాకుండా ఎలా అడ్మిషన్లు తీసుకుంటారని.. తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, సీపీఐ నాయకుడు ఓరుగంటి యాదయ్య అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న పేరెంట్స్, విద్యార్థులకు మద్దతుగా.. కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైఠాయించారు. గురునానక్ యూనివర్సిటీ పేరు చెప్పి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని వెంకట్ అన్నారు. 45 రోజులుగా న్యాయం కోసం తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యాన్ని జైలులో పెట్టాలని ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు.

కదలని పేరెంట్స్..

సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నా.. వర్షం జల్లులు కురుస్తున్నా పేరెంట్స్ కళాశాల నుంచి కదలకుండా బైఠాయించారు. రెచ్చిపోయిన ఆందోళనకారులు కళాశాల అద్దాలు, ఫర్నిచర్‌ను కర్రలు, రాళ్లతో ధ్వంసం చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళన చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, నియోజకవర్గ అధ్యక్షుడు నందకుమార్, సీపీఐ నాయకులు ఓరుగంటి యాదయ్య, పూల యాదయ్యతోపాటు పలువురు పేరెంట్స్, విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలకు పనికల్పించారు. ఆందోళనకారులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. ఈ క్రమంలో పలువురు గాయపడ్డారు.

స్పృహతప్పిన ఆదిబట్ల సీఐ

ఆందోళనకారులను అరెస్టు చేసి వాహనం ఎక్కిస్తున్న క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. విద్యార్థులు ఒక్కసారిగా ఆదిబట్ల సీఐ రవిపై పడటంతో ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. వెంటనే ఆయనను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాత్రి వరకు పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిదా?



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిదని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. హిమాయత్‌సాగర్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ పూర్వ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సొమ్ము కేంద్రానిదైతే.. సోకు రాష్ట్ర ప్రభుత్వానిదని విమర్శించారు. కేంద్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నా.. తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని, మనం చేస్తున్న పనులు వారికి తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, మల్లారెడ్డి, నక్కలపల్లి జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనంతయ్య, వెంకటకష్ణ, ఆగంరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, చేవెళ్ల నియోజకవర్గం నాయకులు మోర నర్సింహ్మారెడ్డి, ఎలిగని వెంకటేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఈఓపై చైర్‌పర్సన్ గుస్సా



అమరవీరుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్‌పై జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ అమర వీరులకు నివాళి అర్పించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు జెడ్పీటీలకు ఆహ్వానం పంపడంతో వారంతా వచ్చి చైర్ పర్సన్ చాంబర్‌లో ఆసీనులయ్యారు. అప్పటికే శంకర్‌పల్లి రైల్‌కోచ్ ప్రారంభోత్సవానికి హాజరై వచ్చిన చైర్‌పర్సన్ అనితారెడ్డి.. సీఈఓ ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నానని, మీరు వెళ్లి అమరులకు నివాళి అర్పించొచ్చని, ఇందుకు సమావేశ మందిరంలో అన్ని ఏర్పాట్లు చేశామని, వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన వెంటనే తాను కూడా కార్యక్రమంలో జాయిన్ అవుతానని సీఈఓ దిలీప్‌కుమార్ చెప్పినా..చైర్ పర్సన్ విన్పించుకోలేదు. మీ కోసం మేమంతా ఎదురు చూడాలా? అంటూ ఆయనపై మండిపడ్డారు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత అంతా కలిసి సమావేశ మందిరంలోకి చేరుకున్నారు. తెలంగాణ అమరవీరుల చిత్రపటానికి పూలుచల్లి నివాళి అర్పించారు. చైర్ పర్సన్ సహా జెడ్పీటీలు తెలంగాణ ఉద్యమంతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

కడ్తాల్‌లో ఎన్‌ఐఆర్‌డీ బృందం పర్యటన

కడ్తాల్: రాజస్థాన్, మధ్యప్రదేశ్, గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్‌డీ) అధికారుల బృందం గురువారం మండల కేంద్రంలో పర్యటించింది. ఈ సందర్భంగా కడ్తాల్, మైసిగండి గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జీవనోపాధికి ఏర్పాటు చేసిన వివిధ రకాల యూనిట్స్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి యూనిట్స్ ద్వారా వస్తున్న ఆదాయం, లాభ నష్టాలు, మెటీరియల్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల యూనిట్స్‌ను ఏర్పాటు చేసుకుని మహిళా సంఘాలు సాధిస్తున్న ప్రగతిని చూసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ జంగారెడ్డి, డీపీఎం నర్సింహ, ఏపీఎం రాజేశ్వరి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కైలేశ్ చంద్రశర్మ, కమలేశ్‌లోధా, అశిశ్‌నాయక్, అక్షిత పరాభ్, విద్యా, రక్షత, పాయల్‌కుమారి, జ్యోతీ లహరి అమ్రపాలి జవాల్కర్, సీసీలు లుజారీనా, నర్సింహ, మల్లేశ్, రాములు, వసంత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జంగమ్మ, నిర్మల, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా స్వయం సహాయక సంఘాలతో మాట్లాడుతున్న ఎన్‌ఐఆర్‌డీ బృందం సభ్యులు

కోటంత బోనం



బోనాల ఊరేగింపులో సందడి

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం పాతబస్తీ నుంచి గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం నుంచి గోల్కొండ కోటకు బంగారు బోనం సామూహిక ఊరేగింపు జరిగింది. సప్త మాతృకలకు సప్త బంగారు బోనంలో భాగంగా మొదటి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలను గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించారు. లంగర్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ మహమూద్ అలీలతో పాటు నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు బంగారు బోనంతో వచ్చిన జోగిని నిషా క్రాంతికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్, మధుసూదన్ గౌడ్, గాజుల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్: బోనాల ముందు రోజు అమ్మవారు తొలకరి జల్లులతో ఆశీర్వదించిందని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ అన్నారు. లంగర్‌హౌస్ చౌరస్తాలో అమ్మవారి రథం, తొట్టెలకు పూజలు నిర్వహించి కల్లు సాక పెట్టారు. అనంతరం వేదపండితుల సమక్షంలో గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక అమ్మవారి కోసం జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్లి జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించి ర్యాలీని ప్రారంభించారు. వేడుకల్లో రాష్ట్ర నాయకులు జీవన్‌సింగ్, కావూరి వెంకటేష్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అమ్మవారికి తొట్టెలకు పూజలు చేశారు.



పోతరాజుల విన్యాసం



మంత్రులు మహమూద్ అలీ, తలసాని, ఇంద్రకరణ్‌రెడ్డి

పోటీల్లో నిలిచిన నగర మెట్రో

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (యూఐటీపీ) అవార్డు కోసం హైదరాబాద్ ఎల్అండ్‌టీ మెట్రో రైల్ పోటీలో నిలిచింది. ఈ నెల 4 నుంచి 7 వరకు స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరిగిన యూఐటీపీ గ్లోబల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు సదస్సులో ఎల్అండ్‌టీ మెట్రో రైలును నామినేట్ చేశారు.ఎలివేటింగ్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ హైదరాబాద్, ఇండియాపై సమర్పించిన నామినేషన్ ఫైనల్‌లిస్టులో ఎల్ అండ్‌టీ ఒకటిగా ఎంపిక చేశారు. మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ కేటగిరీ కింద వచ్చిన 500 నామినేషన్లలో ఎల్అండ్‌టీ తుది జాబితాలో నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఈఓ కె.వి.బి.రెడ్డి మాట్లాడుతూ.. ఫైనల్ లిస్టుకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. హైదరాబాద్ ప్రయాణికులకు పర్యావరణ అనుకూలమైన రవాణా విధానాన్ని అందిస్తున్న తమకు సముచితమైన గుర్తింపు లభించిందన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలను అందజేసేందుకు అంకితభావంతో ఉన్నట్లు చెప్పారు.

బండెనక బండి.. వరుసగా ఢీకొని..

- మూడు వాహనాలు ధ్వంసం

ఇబ్రహీంపట్నం రూరల్‌: ముందుగా వెళ్తున్న కారు సడన్‌ బ్రేక్‌ వేయడంతో ఒకదానికొకటి మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం నుంచి నగరానికి వాహనాలు వెళ్తున్నాయి. బొంగ్లూర్‌ సమీపంలోని ఓ హోటల్‌ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టీఎస్‌ 07 జెడీ1881 ఫార్చునర్‌ కారు నడుపుతున్న డ్రైవర్‌ సడన్‌ బ్రేక్‌ వేశాడు. దీంతో వెనకాల ఉన్న సీవీఆర్‌ కళాశాల బస్సు ఫార్చునర్‌ను ఢీకొట్టింది. బస్సు వెనకాల వస్తున్న మరో కారు బస్సు కిందకు వెళ్లిపోయింది. కారు నుజ్జునుజ్జయింది. మొత్తం మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదానికి కారణం ఫార్చునర్‌ కారును మైనర్‌ నడపడం వల్లే జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆదిబట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

దశాబ్ది ఉత్సవాల పేరిట దగా



కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నేతలు

- కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నిరసన

కడ్తాల్‌: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట దగా చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని నిరసిస్తూ గురువారం కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిందని, అయితే.. ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదన్నారు. తొమ్మిదేళ్లుగా ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని ముఖ్యమంత్రి కేసీఆర్‌.. ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీటీసీ రాములుగౌడ్‌, కోఆప్షన్‌ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌ ఉన్నారు.



అమరుడు కాకి కుమార్‌ తండ్రి నర్సింహను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



షాద్‌నగర్‌: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

ఉద్యమకారుల సేవలకు గుర్తింపు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అమరుల స్తూపం వద్ద నివాళులు

ఇబ్రహీంపట్నం: అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ, దశాబ్ది ఉత్సవాల చివరిరోజైన గురువారం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరుల త్యాగాలను, ఉద్యమకారులను ఎప్పటికీ తెలంగాణ ప్రజలు మరిచిపోరన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో రాష్ట్రం శరవేగంగా సంక్షేమ, అభివృద్ధి రంగాలల్లో దూసుకుపోతోందని చెప్పారు. ఉద్యమకారుల సేవలకు గుర్తింపు ఉంటుందని, వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కాలంలో అమరుడైన కొంగరకలాన్‌ గ్రామానికి చెందిన కాకి కుమార్‌ తండ్రి కాకి నర్సింహను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కప్పరి స్రవంతి, ఎంపీపీ కృపేశ్‌, వైస్‌ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలు మరువలేనివి: ఎమ్మెల్యే అంజయ్య

షాద్‌నగర్‌: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది అమరులయ్యారని, వారి త్యాగాలు మరవలేనివని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం షాద్‌నగర్‌ మున్సిపల్‌ కార్యాలయంలో అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఏళ్ల పోరాటం జరిగిందన్నారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పాటయ్యిందని తెలిపారు. త్యాగాల పునాదుల మీదుగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్‌ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌ వన్‌ స్థానంలో నిలిచిందన్నారు. మిషన్‌ భగీరథ ద్వారా మంచినీరు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌, పెన్షన్లు ఇలా ఎన్నో పథకాలను చేపట్టారని అన్నారు. దశాబ్ద కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయడం, అమరులను స్మరించుకోవడం తప్పా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌, వైస్‌ చైర్మన్‌ ఎంఎస్‌ నట్‌రాజన్‌, కమిషనర్‌ వెంకన్న, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్‌ తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

కందుకూరు: కల్తీ ఐస్‌క్రీమ్‌ తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాజస్థాన్‌కు చెందిన రాహుల్‌ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఐస్‌క్రీమ్‌ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం మహేశ్వరం జోన్‌ ఎస్‌ఓటీ పోలీసులు ఆ కేంద్రంపై దాడి చేశారు. ఐస్‌క్రీమ్‌ కల్తీతో పాటు తప్పుడు బ్రాండ్ల పేరుతో చాకోబార్‌ తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఐస్‌క్రీమ్‌ ముడి సరుకును సీజ్‌ చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మూగజీవాల మృత్యుఘోష

- విద్యుదాఘాతంతో మూడు పశువుల మృతి

ఇబ్రహీంపట్నం రూరల్‌: విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యానికి మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కౌలు రైతు గుంటి పాపయ్య వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం పశువులను మేపడానికి వెళ్లాడు. తనకు ఉన్న రెండు కాడెద్దులు, పాడి ఆవు మేత మేస్తుండగా అచ్యుత్‌రెడ్డి పొలంలో కరెంట్‌ తీగలు కట్‌ అయి పశువులకు తగిలాయి. దీంతో మూడు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. కాగా, పశువుల మృతికి కారకులైన విద్యుత్‌ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు సామేలు, ముసలయ్య, జంగయ్య డిమాండ్‌ చేశారు. బాధితుడికి పరిహారం అందించాలని కోరారు.



విద్యుత్‌ షాక్‌తో మరణించిన పశువులు

సమగ్ర విచారణ చేపట్టండి

ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాలో జరిగిన విద్యుత్‌ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్‌ శాఖ రంగారెడ్డి జిల్లా సీజీఎం ఆనంద్‌ ఆదేశించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

యాచారం: విషం తాగినట్లు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు ఆరోగ్యం విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు... నల్లగొండ జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన శివ(25) వ్యక్తిగత సమస్యలతో జూన్‌ 12న విషం తాగాడు. మండల పరిధిలోని మాల్‌ గ్రామ పంచాయతీ సమీపంలో స్పృహతప్పి పడిపోయాడు. స్వయంగా అతడే యాచారం పోలీసులకు ఫోన్‌చేసి తాను విషం తాగినట్లు తన ప్రాణాలను కాపాడాలను వేడుకున్నాడు. పోలీసులు వెంటనే అతడిని మాల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శివ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రాములు (ఫైల్‌)

నందిగామ: రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నందిగామలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొంగుపల్లి రాములు(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున రైలు పట్టాలపై శవమై కనిపించాడు. రాములు ప్రమాదవశాత్తు రైలు ఢీకొని చనిపోయాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి

కొత్తూరు: ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరులో గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌(23) బుధవారం కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో కొత్తూరు రైల్వే వంతెన కింద ఓ యువకుడి మృతదేహం పడి ఉందనే సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అతడిని శ్రీకాంత్‌గా గుర్తించారు. శ్రీకాంత్‌ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పహాడీషరీఫ్‌: అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లికి చెందిన అనూష(35) రాంచందర్‌ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి..

బంగారు ఆభరణాల చోరీ

ఘట్‌కేసర్‌: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి తాగించి మహిళ మెడలో ఉన్న 4 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీనగర్‌లో ఉంటున్న సాన్యం నీలమ్మ ఇంటికి రెండు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. మంగళవారం సాయంత్రం మళ్లీ వచ్చిన వారు ఆమెను మాటల్లో కూల్‌డ్రింక్స్‌లో మత్తుమందు కలిపి తాగించారు. ఆమె అపస్మారక స్థితికి చేరుకోగానే ఒంటిపై ఉన్న మూడు తులాల మంగళ సూత్రం, తులం కమ్మలు లాక్కెళ్లారు. ఆలస్యంగా దీనిని గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుతో విద్యార్థికి గాయాలు

సనత్‌నగర్‌: కుక్క కాటుతో ఓ విద్యార్థి గాయపడిన సంఘటన సనత్‌నగర్‌ పరిధిలోని సెయింట్‌ థెరిస్సా స్కూల్‌లో గురువారం చోటు చేసుకుంది. దాడి చేసింది స్కూల్‌ సిబ్బంది పెంచుకుంటున్న కుక్కగా స్థానికులు పేర్కొంటుండగా వీధి కుక్క అంటూ పాఠశాల నిర్వాహకులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం సాయంత్రం సనత్‌నగర్‌ సెయింట్‌ థెరిస్సా స్కూల్‌లో తరగతులు ముగిసిన అనంతరం కొందరు విద్యార్థులు తమ కుటుంబసభ్యుల కోసి స్కూల్‌ గ్రౌండ్‌లో వేచి ఉన్నారు. అదే సమయంలో గ్రౌండ్‌లోకి వచ్చిన కుక్క ఆరో తరగతి విద్యార్థిపై దాడి చేయడంతో అతడికి గాయాలయ్యాయి. సదరు కుక్క స్కూల్‌ సిబ్బంది పెంపుడు కుక్కగా తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ సుజాతను వివరణ కోరగా గ్రౌండ్‌లోకి వచ్చిన కుక్కను బయటికి తరిమే క్రమంలో బాధిత విద్యార్థి దానిని రాయితో కొట్టడంతో అది అతడిపై దాడి చేసినట్లు తెలిపారు. విద్యార్థికి టీటీ ఇంజక్షన్‌తో పాటు యాంటీ ర్యాబీస్‌ ఇంజెక్షన్‌ చేయించినట్లు ఆమె వివరించారు.

బడికి వెళ్లలేదని తండ్రి మందలింపు

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు
- మరునటి రోజు యంజాల్‌లో గుర్తింపు

ఇబ్రహీంపట్నం రూరల్‌: బడికి ఎందుకు వెళ్లట్లేదని తండ్రి మందలించడంతో బాలుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కి చెందిన సత్తయ్య కుమారుడు మహేందర్‌ కొంగరకలాన్‌ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా బడికి పోవటంలేదని బుధవారం తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన మహేందర్‌ అదేరోజు ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం తుర్కయంజాల్‌లో మహేందర్‌ ఆచూకీ లభించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు మహేందర్‌ను అప్పగించారు. బాలుడు లభించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగినికి న్యూడ్‌ కాల్స్‌

నిందితుడి అరెస్టు, 14రోజుల రిమాండ్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిని వేధిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్‌ఐ శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. కడ్తాల్‌ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్‌ ఆదిబట్ల సమీపంలోని సాయితేజ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తుండేవాడు. అపార్ట్‌మెంట్‌లో టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేసుకునే వారికి పార్సిల్స్‌ తీసుకొచ్చి ఇచ్చేవాడు. ఆ క్రమంలో కొంతమంది ఫోన్‌నంబర్లు మనోజ్‌ కుమార్‌ వద్ద ఉన్నాయి. ఈ క్రమంలో టీసీఎస్‌లో పనిచేసే ఓ సాఫ్ట్‌వేర్‌ యువతిని న్యూడ్‌ ఫోన్‌కాల్స్‌ చేస్తూ కొద్దిరోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు భరించలేని సదరు ఉద్యోగిని గురువారం ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మనోజ్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌ విధించారు.

మహిళల అదృశ్యం



సరస్వతి(ఫైల్‌)



నందిని(ఫైల్‌)

చేవెళ్ల: మతిస్థిమితం సక్రమంగా లేని మహిళ ఇంట్లో చెప్పకుండా వెళ్లి కనిపించకుండా పోయింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని తలారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సరస్వత(38) ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిందని తెలిపారు. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో ఆమె కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో గురువారం ఆమె భర్త సుకుమార్‌ గౌడ్‌ చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శంకర్‌పల్లిలో...

శంకర్‌పల్లి: ఏడు నెలల గర్భిణి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. ఎల్వర్తి గ్రామానికి చెందిన నందిని(19), నవీన్‌కుమార్‌ పది నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం నందిని ఏడు నెలల గర్భిణి. గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె అచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా



మొండిగౌరెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, సరైన ప్రచారం నిర్వహించుకుని బీజేపీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. మహాజన్‌ సంపర్క్‌ అభియాన్‌లో భాగంగా యాచారం, మొండిగౌరెల్లి, నక్కర్తమేడిపల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. యాచారంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని నర్సరీలు, మొక్కల పెంపకం, శ్మశానవాటికలు, డంపింగ్‌ యార్డులు, సీసీ రోడ్లు, ఉపాధి పనులు వంటి అనేక పథకాలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు పైసా నిధులు మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్‌, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు వెంకటేష్‌, శివకుమార్‌, మొండిగౌరెల్లి పంచాయతీ వార్డు సభ్యులు అంజమ్మ, పాండు యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- టూరిజం మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా
- కాన్హాలో బ్యాడ్మింటన్‌ పోటీలు ప్రారంభం

నందిగామ: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని టూరిజం మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా అన్నారు. నందిగామ మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలను బ్యాడ్మింటన్‌ కోచ్‌ పుల్లెల గోపిచంద్‌, ఏపీ విశ్రాంత చీఫ్‌ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యంతో కలసి ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్‌ స్టేడియంలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన యువతకు మంచి భవిష్యత్‌ ఉంటుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, కోశాధికారి బాబు, ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ సభ్యులు శ్రీనివాస్‌, లక్ష్మన్‌, ఆనంద్‌, సత్య, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్‌ గుప్తా. చిత్రంలో పుల్లెల గోపిచంద్‌